క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ, కోకాపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని బాబుఖాన్ ఫీడర్, కోకాపేట ఫీడర్, ఓషియస్ పార్క్ ఫీడర్, గూంచహిల్స్ ఫీడర్‌ల పరిధిలో బుధవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని ఏఈ టి.సందీప్ ప్రకటించారు. విద్యుత్ వైర్లకు సమీపంలోని చెట్ల కొమ్మలను తొలగిస్తున్న కారణంగా విద్యుత్ ఉండదన్నారు.

రాజేంద్రనగర్: ఎస్‌ఎంగూడ ఓహెచ్ విద్యుత్ ఫీడర్ పరిధిలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నందిముస్లాయిగూడ, ఎస్పీనగర్, మారుతీనగర్, అత్తాపూర్, రాంబాగ్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో కోత ఉంటుందని విద్యుత్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్‌ఎంగూడ యూజీసీ ఫీడర్‌లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తేజస్వీనగర్ కాలనీ, అత్తాపూర్, సీబీఐటీ కాలనీ, సోమిరెడ్డినగర్, వాసురెడ్డినగర్, అసద్‌బాబానగర్ ఫీడర్‌లో మధ్యాహ్నం 4 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అసద్‌బాబానగర్, కిషన్‌బాగ్, మహమ్మూద్‌నగర్ తదితర ప్రాంతాల్లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

ప్లాస్టిక్ వినియోగంపై దుకాణాల తనిఖీలు



దుకాణాలను తనిఖీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ భోగీశ్వర్లు

శంషాబాద్: నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వినియోగించకూడదని మున్సిపల్ కమిషనర్ భోగీశ్వర్లు హెచ్చరించారు. పట్టణంలోని పలు దుకాణాలను పారిశుద్ధ్య విభాగం అధికారి లక్ష్మయ్యతో కలిసి ఆయన తనిఖీలు నిర్వహించారు. నిషేధిత ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్న 4 దుకాణాలకు రూ. 10 వేల జరిమానా విధించినట్లు అధికారులు ప్రకటించారు. తక్కువ మైక్రాన్‌లు కలిగిన ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్న దుకాణాలపై జరిమానాతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.


అభివృద్ధి పనుల పరిశీలన



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

రాజేంద్రనగర్: అభివృద్ధి పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా సకాలంలో పనులను పూర్తి చేయాలని కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని బాబుల్‌రెడ్డినగర్ పోచమ్మ దేవాలయం వద్ద అభివృద్ధి పనులను అధికారులు, పార్టీ నాయకులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపాలు లేకుండా పూర్తి చేయాలన్నారు. డివిజన్ ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు శరవేగంగా పనులు నిర్వహించాలన్నారు. ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకొస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రమేష్, పాండుయాదవ్, గోపాల్, శంకర్, మల్లేష్‌నాయక్, కురుమూర్తి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత



వినతిపత్రం అందజేస్తున్న కోరని దయానంద్ తదితరులు

రాజేంద్రనగర్: బోనాల పండుగ సందర్భంగా దేవాలయాల వద్ద అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాలని మాజీ కౌన్సిలర్ కోరని దయానంద్ అన్నారు. ఈ మేరకు మంగళవారం జీహెచ్‌ఎంసీ అధికారులకు ఆయన వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని దేవాలయాల వద్ద వీధిదీపాలు, మ్యాన్‌హోల్స్ తదితర సమస్యలతో ప్రజలకు అసౌకర్యం ఉండకుండా జీహెచ్‌ఎంసీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రజలు బోనాల పండుగను నిర్వహించుకుంటారని వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా దేవాలయాల వద్ద అభివృద్ధి, ప్యాచ్ వర్క్స్ చేపట్టాలన్నారు. పంబాల రాజు, నరేందర్, కుమార్, హరిచంద్ర, ప్రసాద్ తదితరులున్నారు.

మూతబడిన జలధార

- నీటి సరఫరా నిలిపేసిన జలమండలి
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు



మణికొండ మర్రిచెట్టు సర్కిల్‌లో ఉన్న జలధార కేంద్రం

మణికొండ: ప్రజలు నమ్మకంతో తాగుతున్న తాగునీటి జలధార కేంద్రాన్ని జలమండలి అధికారులు మూసి వేశారు. నిత్యం వేలాది మంది రూ.5కే తాగునీటి క్యాన్‌ను పట్టుకుని వెళ్లి తాగుతున్నారు. అలాంటి నీటి సౌకర్యం లేకుండా చేయటంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మణికొండ మున్సిపాలిటీ కేంద్రం మర్రిచెట్టు సర్కిల్‌లో గ్రామపంచాయతీలుగా ఉన్న సమయంలో స్మార్ట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వారు ప్రజలకు స్వచ్ఛమైన నీటిని తక్కువ ధరకు అందించాలనే ఉద్దేశంతో జలధార నీటి కేంద్రాలను ఏర్పాటు చేశారు.

- గండిపేట మండల పరిధిలో మణికొండ, మంచిరేవుల, కోకాపేట్‌లలో అప్పటి గ్రామపంచాయతీల కోరిక మేరకు వాటిని ఏర్పాటు చేశారు.
- సమీప గ్రామాలలోని ప్రజలు నమ్మకంతో జలధార నీటిని తీసుకుని తాగుతున్నారు. ఇలాంటి సౌకర్యాన్ని మిగతా రెండు గ్రామాలలో కొనసాగిస్తూ.. ఒక గ్రామంలో ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడని మూసి వేయటంపై స్థానికులు మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.
- మణికొండలో అలాంటి కేంద్రాలనే సెక్రటేరియట్ కాలనీ, పుప్పాల్‌గూడ సంప్‌ల వద్ద కూడా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఉన్నతాధికారులతో చర్చిస్తున్నాం

గతంలో బోరు నీటిని తీసుకుని శుద్ధి చేసి ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలనే ఉద్దేశంతో జలధార కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం జలమండలి శుద్ధి చేసిన నీటినే సరఫరా చేస్తున్నాం. ఆ నీటినే నేరుగా తాగవచ్చు. జలధార కేంద్రాన్ని మూసినందుకు ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి ఒత్తిడి వస్తోంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటాం.

– స్ఫూర్తిరెడ్డి, మేనేజర్, జలమండలి

పేద విద్యార్థులకు ప్రోత్సాహం



విద్యార్థులకు షూస్ అందజేస్తున్న వైస్‌చైర్మన్, కమిషనర్‌లు

మణికొండ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు మన వంతు సహకారం అందించి ప్రోత్సహిస్తే వారు జీవితంలో ఉన్నత స్థానాలకు వెళతారని నార్సింగి మున్సిపాలిటీ వైస్ చైర్మన్ వెంకటేష్‌యాదవ్ అన్నారు. మంగళవారం ఆయన తన సొంత నిధులతో నార్సింగిలోని ఉర్దూ మీడియంలో చదువుకుంటున్న 236మంది విద్యార్థులకు షూస్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది నుంచి విద్యార్థులకు నోట్‌బుక్స్ సైతం అందించడం హర్షణీయమన్నారు. రాబోయే రోజుల్లో షూస్‌ను అందిస్తే విద్యార్థులు మరింత ఉత్సాహంతో చదువుకుంటారన్నారు. నార్సింగి మున్సిపాలిటీ కమిషనర్ సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇలాంటి సేవా కార్యక్రమాలు మనకు ఎంతో మానసిక తృప్తిని ఇస్తాయన్నారు. మన సంపాదనలో కొంత ఇలాంటి కార్యక్రమాలకు ఖర్చు చేయాలని సూచించారు.

బోనాలను ఘనంగా నిర్వహించాలి



మున్సిపల్ సిబ్బందికి వాకీటాకీలు అందజేస్తున్న కౌన్సిలర్‌లు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో వచ్చే ఆదివారం బోనాలను ఘనంగా నిర్వహించాలని దీనికి అవసరమైన ఏర్పాట్లను అమ్మవారి దేవాలయాల వద్ద చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన మున్సిపల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చే ఆదివారం బోనాల పండగకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించి మణికొండ, పుప్పాల్‌గూడ దేవాలయాల వద్ద అలంకరణ, పూజలకు రూ. 4లక్షలు ఖర్చు చేయాలని తీర్మాణం చేశారు. జలమండలి తరఫున ఏర్పాటు చేస్తున్న పైప్‌లైన్లు రోడ్లపై కాకుండా రోడ్డు పక్కన తవ్వకాలు చేపట్టి ప్రజాధనం వృధా కాకుండా చూడాలన్నారు. ఈ మధ్య ఇష్టానుసారంగా మూడు, నాలుగు రోజులకోసారి నీటి సరఫరా చేస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కౌన్సిల్ సభ్యులు జలమండలి అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. ఇకపై అలా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మంజూరైన పైప్‌లైన్ల పనుల వివరాలను సభ్యులకు వివరించారు. డిజాస్టర్ సిబ్బందికి తగిన సూచనలు ఇచ్చేందుకు వారికి వాకీటాకీలను అందజేశారు. మున్సిపల్ కమిషనర్ కె.ఫల్గుణ్‌కుమార్, వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, మేనేజర్ బీఎన్‌కే రమేష్, డీఈ దివ్యజ్యోతి, ఏఈ సాయిమౌనిక, టీపీఓ రాకేష్, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా తొట్టెల ఊరేగింపు



వినాయక్‌నగర్‌లో ఫలారం బండి ఊరేగింపులో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

రాజేంద్రనగర్: ఆషాఢమాసం బోనాల పండుగను పురస్కరించుకుని రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని వినాయక్‌నగర్ బస్తీలో శ్రీకాంత్‌యాదవ్ ఆధ్వర్యంలో ఫలారం బండి ఊరేగింపు, తొట్టెల ఊరేగింపు కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ పాల్గొని ఊరేగింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం శ్రీకాంత్‌యాదవ్ మాట్లాడుతూ.. గత ఆరేళ్లుగా వినాయక్‌నగర్ బస్తీలో ఘనంగా అమ్మవారి ఫలారం బండి ఊరేగింపు కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. పలువురు నాయకులు, వినాయక్‌నగర్ బస్తీ వాసులు పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ పల్లకి సేవ

శంషాబాద్: హిందూ వికాస్ సమితి ఆధ్వర్యంలో పట్టణంలరేణుకా ఎల్లమ్మ దేవాలయంలో ఆషాఢం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి పల్లకి సేవలో రఘునాథ్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు డాక్టర్ ప్రేమ్‌రాజ్, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బైతి శ్రీధర్, వివేకానంద కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

గచ్చిబౌలి టు అప్పాకు బస్సు సౌకర్యం

రాయదుర్గం: గండిమైసమ్మ ఎక్స్‌రోడ్ నుంచి వయా గచ్చిబౌలి మీదుగా అప్పా వరకు నూతన బస్సు సౌకర్యాన్ని బుధవారం నుంచి ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రోజూ నాలుగు సిటీ ఆర్డినరీ బస్సులను నడపాలని నిర్ణయించారు. 221 జీఎం నంబర్‌తో ఉదయం బస్సు 6:40గంటలకు ప్రారంభమై రాత్రి 9:15 గంటల వరకు నడుపుతున్నామని డిపో మేనేజర్ శ్రీనివాస్ ప్రకటించారు. ఈ బస్సు మియాపూర్ మీదుగా గచ్చిబౌలి వరకు, నార్సింగి మీదుగా అప్పా వరకు కొనసాగుతుంది. నార్సింగి, గచ్చిబౌలి, మియాపూర్ మల్లంపేట్, బౌరంపేట్ మీదుగా గండిమైసమ్మ ఆలయం ఎక్స్‌రోడ్ వరకు నడుస్తుందన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్రకు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి చంద్రమోహన్ మాట్లాడుతూ.. తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్రంలో ఉన్న అన్ని మున్సిపల్ కార్మికులందరూ.. కలిసి సీడీఎంఏ మున్సిపల్ ఆఫీస్ ముట్టడిలో కార్మికులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో కార్మికులందరినీ ప్రస్తుతం రూ.21 వేల వేతనం, రూ.6 లక్షల ప్రమాదబీమా సౌకర్యం కల్పిస్తుందన్నారు. 11వ పీఆర్‌సీ కమిషన్ సూచించినట్లుగా మున్సిపల్ కార్మికులకు రూ. 31 వేల వేతనం లేదా రూ.29 వేలు, రూ.25 లక్షల ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలని కోరారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రుద్రకుమార్, గండిపేట మండల కన్వీనర్ ప్రవీణ్‌కుమార్, వై.యాదగిరి, సుభాష్, తౌఫిక్, సురేష్, నరేష్, యాదగిరి, మల్లేష్, వెంకటేష్, జగన్, రాము తదితరులు పాల్గొన్నారు.

కిస్మత్‌పూర్‌లో హాథ్ సే హాథ్ జోడోయాత్ర

బండ్లగూడ: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కిస్మత్‌పూర్ 9వ డివిజన్‌లో కాంగ్రెస్ హాథ్ సే హాథ్ జోడో అభియాన్ యాత్రకు స్థానికులు బ్రహ్మరథం పట్టారు. మంగళవారం అడుగడుగునా కాంగ్రెస్ శ్రేణులకు ఘన స్వాగతం పలికారు. కార్పొరేటర్ లంకల నిఖిలసంగారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ యాత్రకు నియోజకవర్గ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీనియర్ నాయకులు లంకల సంజీవరెడ్డి, పూలపల్లి కృష్ణారెడ్డి, డప్పు నవీన్‌కుమార్, కె.సుధాకర్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్, ప్రవీణ్‌ముదిరాజ్, రమేష్‌యాదవ్, బొర్రా శ్రీనివాస్, గంగని రవికుమార్ పాల్గొన్నారు.



కాంగ్రెస్ జోడోయాత్రలో పాల్గొన్న నేతలు

ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేయండి



మణికొండ: అలకాపూర్ టౌన్‌షిప్‌లో విద్యుత్ సరఫరాలో ఇబ్బంది కారణంగా అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేయాలని సంక్షేమ సంఘం నాయకులు కోరారు. మంగళవారం ఇబ్రహీంబాగ్ ఏడీఈ కార్యాలయంలో జరిగిన విద్యుత్ సమస్యల పరిష్కార వేదికలో టౌన్‌షిప్ నివాసితుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వంశీ, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, శంకర్‌దేవ్‌లు సమస్యలను వివరించారు. విద్యుత్ సమస్యలను సకాలంలో తీర్చేందుకు సిబ్బందిని పెంచాలని బిల్లులను నెలకు ఒకసారి అదే రోజు తీసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఒక్కరోజు ఆలస్యమైనా బిల్లులు పెరిగిపోతున్నాయన్నారు.

జల వనరుల పరిశుభ్రతకు ఈపీటీఆర్ఐతో ఒప్పందం

గచ్చిబౌలి: సిద్దిపేట మున్సిపాలిటీలో జల వనరుల పరిశుభ్రతకు ఈపీటీఆర్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. మంగళవారం ఈపీటీఆర్ఐ ఇన్నోవేషన్ ఇంక్యుబేటర్ హబ్ హెడ్ డాక్టర్ జె.స్వరాజ్, సిద్దిపేట పట్టణం 39 వార్డు కౌన్సిలర్ దీప్తి నాగరాజు అవగాహన ఒప్పందం పత్రాలపై సంతకాలు చేశారు. డా.స్వరాజ్ మాట్లాడుతూ.. గుర్రపు డెక్కను తొలగించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నామని తెలిపారు.

'ఆరు నెలల్లో వాహనాల కోసం సంప్రదించకపోతే వేలం వేస్తాం'

రాయదుర్గం: సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో స్వాధీనం చేసుకున్న వాహనాల కోసం వాహనదారులు పోలీసులను ధ్రువపత్రాలతో సంప్రదించకపోతే వేలం వేస్తామని సైబరాబాద్ పోలీసులు స్పష్టం చేస్తున్నారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సైబరాబాద్ పరిధిలో 599 వాహనాలను స్వాధీనం చేసుకొని మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ గ్రౌండ్‌లో ఉన్నాయని పోలీసులు తెలిపారు. ఈ వాహనాల వివరాలను సైబరాబాద్ వెబ్‌సైట్ www.cyberabadpolice.gov.inలో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. అభ్యంతరాలు ఉన్న యజమానులు వాటిని తిరిగి పొందేందుకు సంబంధిత పోలీస్ స్టేషన్‌లోని ఎస్‌హెచ్‌ఓను కలిసి మీ వాహనానికి సంబంధించిన డాక్యుమెంట్లను ఆరు నెలల కాలపరిమితి లోపు సంప్రదించాలి. వివరాలకు ఎంటీఓ ఎస్. విష్ణు(94905 17317) లో సంప్రదించాలని కోరారు.

ఏడు ఎస్‌టీపీలకు నిధులు మంజూరు

గచ్చిబౌలి: శేరిలింగంపలి నియోజకవర్గంలో ఏడు ఎస్‌టీపీలకు నిధులు మంజూరయ్యాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. మంగళవారం పాలపిట్ట పార్క్ వద్ద రూ.15.30 కోట్ల అంచనాతో 7ఎంఎల్‌డీ సామర్థ్యం గల ఎస్‌టీపీ పనులను కార్పొరేటర్ షేక్ హమీద్‌పటేల్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ పరిధిలో 772 ఎంఎల్‌డీ సీవరేజ్ ప్లాంట్లకు అదనంగా 1260 ఎంఎల్‌డీ సీవరేజ్ ప్లాంట్లు, రూ.3866.21 కోట్ల నిధులకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. 31 ప్రాంతాల్లో ఎస్‌టీపీలను ఏర్పాటు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. మియాపూర్ పటేల్ చెరువులో 7 ఎంఎల్‌డీ, గంగారం చెరువులో 20 ఎంఎల్‌డీ, దుర్గం చెరువులో 7 ఎంఎల్‌డీ, ఖాజాగూడ చెరువులో 21 ఎంఎల్‌డీ, అంబీర్ చెరువులో 37 ఎంఎల్‌డీ, ఎల్లమ్మకుంటలో 13.50 ఎంఎల్‌డీ, పరికి చెరువులో 28 ఎల్‌ఎల్‌డీ కెపాసిటీ కలిగిన ఎస్‌టీపీ ప్లాంట్ల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయని వివరించారు. మంత్రి కేటీఆర్ సహకారంతో మురుగు నీటి శుద్ధికి అత్యంత ప్రాధాన్యమిస్తున్నారని తెలిపారు. అనంతరం కొండాపూర్ డివిజన్‌లోని శ్రీరాంనగర ఏ బ్లాక్‌లో యూజీడీ పనులకు శంకుస్థాపన చేశారు.

విద్యారంగ సమస్యలపై రాష్ట్రవ్యాప్త బంద్

రాజేంద్రనగర్: రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 12న రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు, ఇంటర్మీడియట్ కళాశాల బంద్ నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ప్రణయ్ కోరారు. రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ.. బంద్‌ను విజయవంతం చేయాలని ప్రజలను కోరారు. ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల నియంత్రణకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. మంత్రులు ఉపసంఘం, తిరుపతిరావు కమిటీ రిపోర్టు బహిర్గతం చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన నిర్దిష్టమైన చర్యలు ప్రభుత్వం తీసుకోవడం లేదని రాష్ట్రంలో భారీ సంఖ్యలో టీచర్, లెక్చరర్స్, ఖాళీలు ఉన్నాయని వాటిని భర్తీ చేయడం లేదన్నారు. ఒక్క డీఎస్సీ ఇప్పటివరకు వేయకపోవడంతోనే రాష్ట్రవ్యాప్తంగా బంద్‌ను నిర్వహిస్తున్నామన్నారు. దీనిపై ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రసాద్, శ్రీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రణయ్

స్వచ్ఛ మున్సిపాలిటీకి కృషి చేయాలి

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఉత్తమ స్వచ్ఛ మున్సిపాలిటీగా నిలిపేందుకు అందరం కలిసికట్టుగా కృషి చేయాలని కమిషనర్ బి.సురేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మున్సిపాలిటీ పరిధిలోని శానిటేషన్, రెవెన్యూ, బిల్‌కలెక్టర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, శానిటేషన్ సూపర్‌వైజర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం శానిటేషన్ పరవాలేదనే స్థాయిలోనే ఉందని దాన్ని మరింత మెరుగుపర్చటంతో పాటు రోడ్ల పక్కన చెత్త కనిపించకుండా చూడాలన్నారు. అప్పుడే మున్సిపాలిటీకి మంచిపేరుతో పాటు స్వచ్ఛతలో అవార్డులు సైతం వస్తాయన్నారు. మున్సిపాలిటీ ఆదాయం పెరిగేలా బిల్‌కలెక్టర్‌లు నెలవారీగా టార్గెట్‌లను విధించుకుని కలెక్షన్‌లను రాబట్టాలన్నారు. వందశాతం పన్నులను వసూలు చేయటమే టార్గెట్‌గా పనిచేయాలన్నారు. వ్యాపార సంస్థలకు తప్పనిసరి ట్రేడ్ లైసెన్సులు ఉండాలని అవి లేకుండా కొనసాగుతున్న వారికి నోటీసులు జారీచేసి మూసి వేయాలని సూచించారు. ప్రతి ఒక్కరి పనితీరులో మార్పును తీసుకొచ్చి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు.



మున్సిపల్ సిబ్బందితో కమిషనర్ సురేందర్‌రెడ్డి